ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

మంగళవారం 22 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm

## అంబర్ కోటను సందర్శించిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కుటుంబం



జైపూర్ : అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబం మంగళవారం అంబర్ కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియా కుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటుచేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబంతో సహా సోమవారం భారత్‌కు విచ్చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన గవర్నర్ హరిభావు కిషన్‌రావ్ బగాడేతో సమావేశం, మధ్యాహ్నం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగించనున్నట్లు సమాచారం. సోమవారం ఢిల్లీ చేరుకున్న వాన్స్ కుటుంబం ప్రధాని నరేంద్రమోదీని కలిశారు. ఆయనతో విందు అనంతరం సోమవారం రాత్రికే జయపురలోని విలాసవంతమైన రాంబాగ్ ప్యాలెస్ హోటల్‌కు చేరుకున్నారు. 23వ తేదీ ఉదయం వాన్స్ కుటుంబం ఆగ్రాకు వెళ్లనుంది. అక్కడ తాజ్‌మహల్‌ను, భారతీయ కళలకు సంబంధించిన శిల్పాగ్రామ్‌ను సందర్శిస్తారు. అదేరోజు మధ్యాహ్నం తర్వాత మళ్లీ వారు జయపురకు వెళ్తారు. 24వ తేదీన జయపుర నుంచి బయలుదేరి అమెరికా వెళ్తారు.

# బాలికలదే పై చేయి



## ఇంటర్ ఫలితాలు

- బోర్డు కార్యాలయంలో రిజల్ట్స్ విడుదల చేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు
- మే 22 నుంచి సప్లిమెంటరీ

హైదరాబాద్ : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. ఇవాళ మధ్యాహ్నం ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌తో కలిపి మొత్తం దాదాపు 9.97 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది కూడా ఫలితాల్లో బాలికలు రాణించారు.

కాగా.. ఫస్టియర్‌లో 66.89 శాతం, ద్వితీయ సంవత్సరంలో 71.37 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 4,88,430 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫస్ట్ ఇయర్ బాలికలు 73.83, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం జనరల్‌లో 4,39,302 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 2,93,852 మంది పాసయ్యారు. కాగా.. 66.89శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక వొకేషనల్‌లో 49,128 మంది పరీక్షలు రాయగా.. 28,339 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 57.68శాతం ఉత్తీర్ణత నమోకాగా.. బాలికలు 74.09శాతం, బాలుర 40.88శాతం ఉత్తీర్ణత నమోదైంది.

రెండో సంవత్సరంలో జనరల్+వొకేషనల్ కలిపి 5,08,582 మంది విద్యార్థులు హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం బాలికలు 74.21, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణులయ్యారు. జనరల్‌లో 4,39,302 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 2,93,852 మంది పాసయ్యారు. కాగా.. 66.89శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక వొకేషనల్‌లో 49,128 మంది పరీక్షలు రాయగా.. 28,339 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 57.68శాతం ఉత్తీర్ణత నమోకాగా.. బాలికలు 74.09శాతం, బాలుర 40.88శాతం ఉత్తీర్ణత నమోదైంది.

### మేలో సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించామని బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 19 కేంద్రాల్లో పేపర్ల వాల్యూయేషన్ చేపట్టామన్నారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు వారం గడువు ఇస్తున్నట్లు చెప్పారు. అయితే.. మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

## మీ ఆలోచనలు, స్ఫూర్తితో ముందుకు వెళతాం

### ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ స్పందన


### రోహిత్ వేముల చట్టం తేవాలని ఇటీవల రాహుల్ గాంధీ లేఖ



హైదరాబాద్ : రాష్ట్రంలో 'రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకురావాలంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం రేవంత్ రెడ్డికి లేఖ రాయగా జపాన్ పర్యటనలో ఉన్న ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. జపాన్‌లోని హిరోషిమా చారిత్రక నగరంలో తాను రాహుల్ రాసిన లేఖను చదివానని అన్నారు. అదృష్టవశాత్తూ, తాను అక్కడే మహాత్మా గాంధీజీ విగ్రహం ఉన్న పవిత్ర స్థలాన్ని సందర్శించబోతున్నప్పుడే అది జరిగిందని పేర్కొన్నారు. రాహుల్ స్ఫూర్తిదాయకమైన పిలుపు తనకు బలంగా తాకిందని.. గర్వించదగిన భవిష్యత్తును రూపొందించడంలో మీ ఆలోచనలు, భావాల స్ఫూర్తితో ముందుకు వెళ్తాం' అంటూ సీఎం రేవంత్ ట్వీట్ చేశారు.

### పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలపై

## నేడు కీలక సమావేశం



వాటికన్ సిటీ: పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై నేడు కీలక కార్డినళ్ల సమావేశం జరగనుంది. ఇటలీ కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు ఇది మొదలుకానుంది. రోమ్‌లో అందుబాటులో ఉన్న కార్డినళ్లు మొత్తాన్ని ఇప్పటికే ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఇందులో పోప్ ఫ్రాన్సిస్ భౌతిక కాయానికి సెయింట్ పీటర్స్ బసిలికాకు ఎప్పుడు తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచాలనే విషయాన్ని నిర్ణయించనున్నారు. వాస్తవానికి బుధవారం ఉదయం నాటికి పోప్ భౌతికకాయం అక్కడికి చేరుకొనే అవకాశం ఉందని నిన్న వాటికన్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం 9 రోజులపాటు సంతాపదినాలు పాటిస్తున్నారు. వీటిని నవెండియలెస్ అంటారు. సాధారణంగా పోప్ అంత్యక్రియలు, ఖననం ప్రక్రియ మృతి చెందిన నాటినుంచి నాలుగు నుంచి ఆరో రోజు మధ్యలో పూర్తి చేస్తారు.

# సివిల్స్‌లో తెలుగు తేజాల హవా

### యూపీఎస్సీ తుది ఫలితాలు విడుదల

### 11వ ర్యాంకు పొందిన సాయి శివాని

### 15వ ర్యాంకు సొంతం చేసుకున్న వెంకటేశ్

ఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ - 2024 తుది ఫలితాలు మంగళవారం మధ్యాహ్నం విడుదలయ్యాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు.

**10 ర్యాంకర్లు వీరే..**

శక్తి దుబే
హర్షిత గోయెల్
డోంగ్రే అర్చిత్ పరాగ్
షా మార్గి చిరాగ్
ఆకాశ్ గార్గ్
కోమల్ పూనియా
ఆయుషి బన్సల్
రాజ్‌కృష్ణ ఝా
ఆదిత్య విక్రమ్ అగర్వాల్
మయాంక్ త్రిపాఠి

### తెలుగు తేజాలు వీరే..

సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సత్తా చాటిన విద్యార్థుల్లో ఇ.సాయి శివానికి 11వ ర్యాంకుతో మెరవగా.. బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38, రావుల జయసింహారెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్ చేతనరెడ్డి 110, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119వ ర్యాంకులతో అదరగొట్టారు. మెయిన్స్‌లో సత్తా చాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17వరకు దశల వారీగా పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది. ఈ ఫలితాల్లో 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా.. జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి109, ఓబీసీ నుంచి 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీ నుంచి 87మంది చొప్పున ఉన్నారు.




# ఆస్కార్... నూతన నిబంధనలు

### 2026 మార్చి 15న 98వ అవార్డుల వేడుక

### ఆస్కార్ వివరాలు వెల్లడించిన అకాడమి



సినిమా : చలన చిత్ర పరిశ్రమ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల వేడుక వివరాలను అకాడమీ తెలియజేసింది. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనున్నట్లు అకాడమీ తెలిపింది. అయితే ఈసారి కొన్ని నూతన నిబంధనలను అకాడమీ ప్రవేశపెట్టింది. ఆస్కార్ పోటీ జాబితాను 2026 జనవరి 22న వెల్లడించనున్నట్లు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ తెలిపింది. పలు కేటగిరీల్లో ఓటింగ్ విధానంలో మార్పులు చేసినట్లు వెల్లడించింది. నామినేట్ చేసిన ప్రతి మూవీని అకాడమీ సభ్యులు ఖచ్చితంగా చూస్తారని తెలిపింది. ఈసారి అచీవ్ మెంట్ ఇన్ కాస్టింగ్ అనే విభాగాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. ఈ విభాగానికి రెండు దశల్లో ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపింది. తుది ఓటింగ్ ముందు కాస్టింగ్ డైరెక్టర్లకు కొన్ని రౌండ్ల టెస్టింగ్ ఉంటుందని వెల్లడించింది. ఈసారి కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి నిర్మించిన మూవీలను కూడా పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. అయితే ఇది ఇతర మూవీలపై ప్రభావం చూపదని స్పష్టం చేసింది. ఏఐ మూవీల కంటే సాధారణ మూవీలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అకాడమీ వెల్లడించింది.

## 1248 నామినేషన్లు

### జూన్ 14న గద్దర్ అవార్డుల ప్రదానం

### ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు



హైదరాబాద్ : జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని నిర్మాత, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్.డి.సి) ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. హెచ్ ఐసీసీ వేదికగా అవార్డులు ప్రదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డ్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో దిల్‌రాజు ప్రకటన చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డులకు పరిశ్రమ నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారాల ఎంపిక కోసం నిష్ణాతులతో కూడిన జ్యూరీని నియమించినట్టు ఇటీవల ఆయన వెల్లడించారు. జ్యూరీ ఛైర్మన్, ప్రముఖ నటి జయసుధ అధ్యక్షతన గత బుధవారం గద్దర్ అవార్డ్స్ జ్యూరీ సమావేశం జరిగింది. నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియ గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత స్పందన గద్దర్ చలన చిత్ర పురస్కారాలకి వచ్చిందన్నారు. అన్ని కేటగిరీలకి కలిపి 1248 నామినేషన్లు అందాయన్నారు. జ్యూరీ ఛైర్మన్ జయసుధ మాట్లాడుతూ "ప్రభుత్వం అప్పగించిన బాధ్యతని సవాల్‌గా తీసుకుని ఎంపిక ప్రక్రియని పూర్తి చేస్తామన్నారు.